# వాన చినుకు

**-ఎన్. శివనాగేశ్వరరావు కథ**

ఉదయం నుంచి ఒకటే వాన. కుంభవృష్టిలా కురుస్తోంది. నిన్న సాయంత్రం వరకు వర్ష సూచనలే లేవు. రాత్రికి రాత్రి మేఘావృతం అయింది. ఉదయాన్నే సన్నటి తుంపరగా మెదయిలన వాన... క్రమేపీ పెనువానగా మారింది. వానకు గాలి తోడయింది.

రాజశేఖర్, ఇంట్లో అసహనంగా అటు...ఇటూ పచార్లు చేస్తున్నాడు. మనసంతా చికాగ్గా ఉంది. ఉదయం నుంచీ కరెంట్ లేదు. సాయంత్రం అయిదింటికే చీకటి అలుముకుంది.

కళ్యాణి కొవ్వొత్తి వెలిగించింది. గాలికి ఆరిపోకుండా కిటికీ మూసేసింది. కిటికీ మూసినా చల్లటి గాలి గదిలో దూరి శరీరాన్ని వణికిస్తోంది. కళ్యాణి గ్యాస్ స్టవ్ వెలిగించి, టీ పెట్టి భర్తకు అందించింది. టీ అందుకుంటూ రాజశేఖర్, భార్య ముఖంలోకి చూసాడు. ఆమె ముఖంలో ఏ భావమూ లేదు. ఉదాసీనంగా ఉంది.

రాజశేఖర్, భార్యవంక నిర్లిప్తంగా చూసి టీ త్రాగసాగాడు. వేడి టీ ఒంటికి వెచ్చదనాన్ని అందజేయడంతో కాస్తంత రిలాక్సింగ్‌గా అనిపించింది. రాజశేఖర్ ఆలోచనల్లో మైత్రేయి తళుక్కున మెరిసింది. అతని శరీరంలో విద్యుత్ ప్రవహించింది. రాజశేఖర్ సిగరెట్ వెలిగించి చెయిర్‌లో వెనక్కువాలి కళ్ళుమూసుకున్నాడు.

మైత్రేయి, అతను పనిచేస్తున్న ఆఫీస్‌కి ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చి ఆరు నెలలయింది. ఆ ఆరునెలల్లో ఆమె ఆఫీస్‌లో అందరినీ ఆకర్షించింది. కారణం..ఆమె అందం...చలాకీతనం! అందరితో సోషల్‌గా మూవ్ అయ్యే మైత్రేయి అంటే ఆఫీస్‌లో మగాళ్ళందరికీ తగని క్రేజ్ ఏర్పడింది. తరుచూ ఆమె సీట్ దగ్గరకు వెళ్ళి పిచ్చాపాటీ మాట్లాడ్డం. వలపు బాణాలు విసరడం సాగించారు.

అయితే మైత్రేయిని ఎవరిని ఎక్కడ ఉంచాలో బాగా తెలుసు. అందులోనూ ఆమె పని విషయంలో సిన్సియర్. ఎవరితోనూ రెండు, మూడు నిముషాలకంటే ఎక్కువ మాట్లాడేది కాదు. తరువాత 'సారీ! పని ఉంది' అని ఫైల్స్‌లో తలదూర్చేది. మగధీరులు వెనక్కు మరలేవారు.

అయితే మైత్రేయి పట్ల అంత ఆసక్తి చూపించని మగవారెవరైనా ఉన్నారంటే అది ఒక్క రాజశేఖరమే! ఆ అనాసక్తే...అతని మీద మైత్రేయికి ఆసక్తిని పెంచింది.

రాజశేఖర్, ఆమె పలకరించినా ముక్తసరిగా మాట్లాడేవాడు. ఒకరోజు ఎవరూ లేనప్పుడు, మైత్రేయి అతనితో ''మీకు నేనంటే ఎందుకు కోపం?' అని అడిగింది. రాజశేఖర్ తడబడ్డాడు. 'మీమీద నాకు కోపమా? ఎందుకలా అనుకున్నారు?''అన్నాడు. 'మీరు నాతో అసలు మాట్లాడరు''అంది మైత్రేయి.

''నాకు ఆడవారితో మాట్లాడే అలవాటు లేదు' అన్నాడు రాజశేఖర్. 'అలవాటు చేసుకోండి' అని చిన్నగా నవ్వి అక్కడ నుంచి వెళ్ళిపోయింది మైత్రేయి. ఆ క్షణం ఆమె చూసిన చూపు రాజశేఖర్ సరిగానే కేచ్ చేసాడు. ఆ తరువాతే అతనామెను పరిశీలనగా చూసాడు.

చూడగానే అందమైన యువతి అనే భావం కలిగించే రూపం ఆమెది. అందమైన వదనంతో మెరిసే కళ్ళు ఆమె ప్రత్యేకత. మాయని చిరునవ్వు ఆమెకు పెట్టని ఆ భరణం. తళుక్కున మెరిసే తెల్లరాయి ముక్కుపుడక ఆమె అందాన్ని మరింత ఇనుమడింప జేస్తుంది.

**తను తన నుదుటిమీద ముద్దాడగానే ''థేంక్యూ''అంది మైత్రేయి. 'ఎందుకు?' అన్నాడు రాజశేఖర్. 'ఇంత విలువైన కానుక ఇచ్చినందుకు' అంది మైత్రేయి. ఆమె మాటలు అతని హృదయపు లోతులను స్పృశించాయి. ఈసారి అతని ముద్దు ముద్దర ఆమె బుగ్గమీద పడింది. ప్రతిగా మైత్రేయి అతని చేతిని తన చేతిలోకి తీసుకొని గాఢంగా ముద్దాడింది.**

మెడలోని బంగారు గొలుసులో ఆమె శరీర వర్ణం పోటీ పడుతుంది. సమున్నతమైన ఎద సంపద మనోహరంగా ఉంటుంది. సన్నటి నడుము ఒంపు తిరిగిన నదిని తలపునకు తెస్తుంది. చీరె కట్టుకు, జాకెట్‌కు మధ్య అనాచ్ఛాదితంగా ఉండే అందం మరొక్కమారు చూడాలనిపించేలా ఉంటుంది. ఆమె చీర కట్టేతీరు ఆడవారికి కూడా అబ్బురమనిపిస్తుంది. అజంతా శిల్పంలా ఉంటుందని కొందరంటే, సినిమా హీరోయిన్‌లా ఉంటుందని కొందరంటారు.

ఆ తరువాత రాజశేఖర్ ఆమెను పాడిగా పలకరించసాగాడు.

ఒకరోజు ఆమె తలదించుకొని 'మిస్టర్ రాజశేఖర్! మీరు నన్ను పలకరించకపోవడమే నయం' అంది. 'ఎందుకని?' అని ప్రశ్నించాడు రాజశేఖర్. 'మీ పలకరింపు మొక్కుబడిలా ఉందేగాని...అందులో రవ్వంత ప్రేమ కూడా లేదు'' అందామె. రాజశేఖర్ ఆమె మనసు గ్రహించాడు.

అతను తన సీట్‌లో కూర్చున్నాడే గాని. మైత్రేయి అన్న మాట పదే పదే జ్ఞాపకం రాసాగింది. మైత్రేయి మాటకు అర్థమేమిటి? ఆమె తన ప్రేమ ఆశిస్తున్నదా? ఆమె పెళ్ళికాని యువతి. కానీ తను వివాహితుడు. ఆ విషయం ఆమెకు తెలియదా? తన కొలీగ్స్ అందరూ మైత్రేయి అంటే పడిచస్తారని తెలుసు. కానీ ఆమె వారెవరిపైనా చూపించని ప్రేమ తన మీద చూపిస్తున్నదెందుకు?

బహుశా ఆమెకు తనకు పెళ్ళయిన విషయం తెలియదేమో! బ్రహ్మచారిని అనుకొని, ప్రేమ అంటూ పలవరిస్తున్నదేమో అనుకున్నాడు రాజశేఖర్. ఆ ఆలోచన అతనికి సమంజసంగా తోచింది.

ఒక రోజు కల్యాణి పేరంటానికి వెళ్ళింది. ఏం తోచక, రాజశేఖర్ సినిమాకి బయలుదేరాడు. హాలు దగ్గర మైత్రేయి కనిపించింది. రాజశేఖర్ కనిపించగానే ఆమె కళ్ళు మెరిసాయి. నవ్వుముఖంతో అతని దగ్గరకు వచ్చి 'ఒక్కరే వచ్చారా?'అని అడిగింది. ''నా భార్య పేరంటానికి వెళ్ళింది. ఏం తోచక వచ్చాను'' అన్నాడు రాజశేఖర్ స్పష్టంగా. 'థేంక్‌గాడ్! ఈరోజు మీ కంపెనీ దొరికింది. నా ఫ్రెండ్ ఒకతె వస్తానని హేండిచ్చింది. ఆల్రెడీ టిక్కెట్స్ తీసేసాను. ప్లీజ్ కమ్' అని సినిమా హాలులోకి దారి తీసింది మైత్రేయి. రాజశేఖర్ ఆమెను అనుసరించాడు.

ఇద్దరూ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. రాజశేఖర్‌కి, మైత్రేయి ప్రక్కన అలా కూర్చోవడం థ్రిల్లింగ్‌గానూ, ఇబ్బందిగానూ ఉంది. తెలిసిన వారెవరైనా చూస్తారేమోనని పరిసరాలు నిశితంగా పరిశీలించసాగాడు. అది గమనించిన మైత్రేయి 'నాకు లేని భయం మీకెందుకు?' అంది. రాజశేఖర్ ఖంగు తిన్నాడు. 'అదేం లేదు' అని గొణిగాడు.

సినిమా హాలు అంత రష్‌గా లేదు. లైట్లు ఆరిపోయాయి.

హేండ్‌రేస్ట్‌మీద ఉన్న రాజశేఖర్ చేతిమీద మైత్రేయి చేయి పడింది. అతను తన చేతిని వెనక్కు తీసుకోబోయాడు. అయితే మైత్రేయి ఆ అవకాశం ఇవ్వలేదు. 'అంటరాని దానిలా చూడకండి' అంది. అతని ఒంట్లో వేడి రాజుకోసాగింది. ఆమె దగ్గరి నుంచి వస్తున్న పెర్‌ఫ్యూమ్ వాసన, ఆమె పెట్టుకున్న సన్నజాజులు మరింత మత్తును కలిగిస్తున్నాయి. ఆమె మోకాలు అతని మోకాలును తాకింది. మైత్రేయి పాదం అతని పాదాన్ని తాకి, నెమ్మదిగా తనవైపులాక్కుంది. కొద్ది క్షణాలకు మైత్రేయి అతనికి చేరువగా జరిగి అతని భుజం మీద తల ఆనించింది.

రాజశేఖర్ మనసు పరవశించిపోయింది. అతను తన పెదవులతో ఆమె నుదుటి మీద ముద్దాడాడు. అతనికి భార్య జ్ఞాపకానికి వచ్చింది. పెళ్ళయిన అయిదేళ్ళలో కల్యాణి ఏనాడూ ఇంత ప్రేమ చూపించలేదు. ఎప్పుడూ ఉదాసీనంగా ఉంటుంది. తన చర్యలకు ఎటువంటి ప్రతి స్పందనా చూపని కల్యాణి మీద క్రమేపీ అతనికి నిర్లిప్తత ఏర్పడింది.

అతను తన నుదుటిమీద ముద్దాడగానే ''థేంక్యూ''అంది మైత్రేయి. 'ఎందుకు?' అన్నాడు రాజశేఖర్. 'ఇంత విలువైన కానుక ఇచ్చినందుకు' అంది మైత్రేయి. ఆమె మాటలు అతని హృదయపు లోతులను స్పృశించాయి. ఈసారి అతని ముద్దు ముద్దర ఆమె బుగ్గమీద పడింది. ప్రతిగా మైత్రేయి అతని చేతిని తన చేతిలోకి తీసుకొని గాఢంగా ముద్దాడింది.

ఇంటర్వల్‌కి లైట్లు లెలిగాయి. ఇద్దరూ దూరంగా జరిగారు. 'నాకు పెళ్ళయింది మైత్రేయీ!' అన్నాడు రాజశేఖర్. 'తెలుసు. అయినా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను'అందామె. 'అదే ఎందుకు?' ప్రశ్నించాడు రాజశేఖర్. ' ఆ ప్రశ్నకు సమాధానం నాకే తెలియదు. ఇక మీకేం చెప్పను? బట్...ఐలవ్యూ!' అంది మైత్రేయి. ఆమె చేయి అతని చేతిని మరింత గట్టిగా పట్టుకుంది.

సినిమా అయ్యాక రిక్షా ఎక్కారు. ఆమె ఇంటి ముందు రిక్షా ఆగింది. 'లోనికి రండి' ఆహ్వానించింది మైత్రేయి. 'మరోసారి వస్తాను'అని వెళ్ళిపోయాడు రాజశేఖర్.

ఇల్లు చేరగానే కల్యాణి అతనికి భోజనం వడ్డించి 'సినిమా కెళ్ళారా' అని అడిగింది.

రాజశేఖర్ తలపంకించి 'నీవు తిన్నావా?'అన్నాడు. 'లేదు. మీరు తిన్నాక తింటాను.' అంది కల్యాణి. రాజశేఖర్‌కి మైత్రేయి జ్ఞాపకానికి వచ్చింది. అదే ఆమె అయితే, ఒక పళ్ళెంలో ఒకరికొకరు గోరుముద్దలు తినిపించుకుంటూ తినేవారేమో అనుకున్నాడు. అతను నిట్టూర్చాడు.

భోజనాలు అయ్యాక రాజశేఖర్ బెడ్‌మీద వాలాడు. కల్యాణి, కిచెన్ సర్ది వచ్చి అతనికి కాస్తంత దూరంగా పడుకుంది.

రాజశేఖర్‌కి మరలా మైత్రేయి జ్ఞాపకానికి వచ్చింది. ఆమె అయితే ఇలా దూరంగా ఉండి ఉండేదా? తన గుండెలో తల దాచుకొని..బలంగా కౌగిలించుకొని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండేది.

ఆ మరునాడు మైత్రేయి ఆఫీస్‌లోకి ఎంటరవుతూనే రాజశేఖర్ వంక చూసి నవ్వింది.


ఆ నవ్వు అతనికెంతో ఉత్తేజాన్నిచ్చింది. ఆమె కళ్ళు ఎఱ్ఱబారి ఉండడం గమనించాడు రాజశేఖర్. లంచ్ అవర్లో మైత్రేయి అతని దగ్గరకొచ్చి 'రాత్రంతా నిదురలేకుండా చేసారు' అంది. 'నాదీ అదే పరిస్థితి' అన్నాడు రాజశేఖర్. 'మీకేం? మీ ఆవిడను కౌగిలిలోకి లాక్కొని హాయిగా నిదురపోయి ఉంటారు!' అంది మైత్రేయి. ఆమె అలా సెక్సీగా మాట్లాడ్డం అతనికి హుషారునిచ్చింది. 'అదేం లేదు. ఆమెను తాకనైనా తాకలేదు. నీ జ్ఞాపకాలతోనే గడిపాను. ప్రామిస్' అన్నాడు. 'నమ్ముతాను. మీరేం చెప్పినా నమ్ముతాను' అంది మైత్రేయి మనస్ఫూర్తిగా. స్టాఫ్‌మెంబర్స్ రావడంతో ఆమె తన సీటు దగ్గరకు వెళ్ళిపోయింది.


ఆ తరువాత రాజశేఖర్, మైత్రేయి ఒకసారి పార్క్‌లో, మరోసారి రెస్టారెంట్‌లో కలుసుకున్నారు. అయినా ఆమెలో ఏదో అసంతృప్తి. రాజశేఖర్ పరిస్థితీ అలానే ఉంది. కల్యాణి దగ్గర ఉంటే మైత్రేయి జ్ఞాపకానికి వచ్చేది. మైత్రేయి దగ్గర ఉంటే భార్యకేదో అన్యాయం చేస్తున్న ఫీలింగ్.

మైత్రేయి, అతన్ని తన గదిగి రమ్మని చాలాసార్లు ఆహ్వానించింది. అయితే రాజశేఖర్ చొరవచూపలేదు. ఒకసారి మైత్రేయి ''నేనెప్పుడూ ఎవరినీ నా రూమ్‌కి ఆహ్వానించలేదు. అందమైన ఆడపిల్ల ఆహ్వానిస్తే తాత్సారం చేసే మగాడు...బహుశా మీరేనేమో!' అంది. అందుకు రాజశేఖర్ ''ముందే చెప్పానుగా. ఆడవాళ్ళ దగ్గర నాకు బిడియం ఎక్కువ''అన్నాడు. 'అది తెలుసు. నిజానికి నేను మీ పట్ల ఆకర్షితురాల్ని అవడానికి కారణం అదే! ఆడవాళ్ళు కనిపిస్తే తినేసేట్లు చూసే మగాళ్ళంటే నాకు అసహ్యం వేసింది. ఆడపిల్ల వంక అసలు చూడని..చూసినా మర్యాద..గౌరవం ఇచ్చేమీరంటే అందుకే నా కిష్టం' అంది మైత్రేయి.

మైత్రేయి పదే పదే అడిగే సరికి ఆదివారం ఆమె గదికివస్తానని చెప్పాడు రాజశేఖర్. అందుకై మైత్రేయి పొంగిపోతూ 'అక్కడ ఎవరూ ఉండరు. ఏ సమయంలో






వచ్చినా ఆహ్వానమే! మీ కోసమని ఓ తాయిలం దాచి ఉంచాను. రాగానే అది ఆరగిద్దురు' అంది. 'ఏమిటా తాయిలం?' అని అడిగాడు రాజశేఖర్. ' ఆ తాయిలం నేను తప్ప మరెవ్వరూ ఇవ్వలేనిది. అర్థం చేసుకోండి' అని వెళ్ళిపోయింది. ఆమె భావం అతను గ్రహించాడు. మనసులో కసి రేగింది.

శనివారం రాత్రి మైత్రేయి ఇవ్వబోయే తాయిలం తలుచుకుంటే నిదురపట్టలేదు. ఆదివారం ఉదయం లేచిన దగ్గరునుంచీ ఒకటేవాన. అడుగు బయట పెట్టడానికి అవకాశం ఇవ్వకుండా గాలి-వాన..అంత వానలో కల్యాణికి ఏం చెప్పి బయటకు వెళ్ళగలడు? కరెంట్ లేని ఆ చీకటిలో..భయం కలిగించే వాతావరణంలో..కల్యాణిని ఒంటరిగా వదిలి ఎలా వెళ్ళగలడు? అయితే మనసు మారాం చేయసాగింది. అక్కడ మైత్రేయి తన కోసం ఎదురుచూస్తుంటుంది.

ఇటువంటి చలిలో..ఆమె గాఢ పరిష్వంగం ఎంత వెచ్చగా ఉంటుంది. కవ్వించే మైత్రేయి చూపులు..రెచ్చగొట్టే ఆమె మాటలు..పురుషత్వానికి సవాల్‌గా నిలిచే ఆమె చేష్టలు..రాజశేఖర్ మనసు ఆమె సన్నిధి కోసం పరితపించసాగింది.

రాజశేఖర్ కిటికీ తెరిచి చూసాడు. వాతావరణంలో మార్పులేదు. ఉదయం నుంచి కురుస్తున్న వాన వలన వీధులన్నీ జలమయం అయిపోయాయి.

తన ఇంటి దగ్గరి నుంచి మైత్రేయి ఇంటికి మామూలుగా అయితే పది నిముషాల నడక. ఇప్పుడీ వానలో పావుగంట పట్టవచ్చు అనుకున్నాడు రాజశేఖర్.

గొడుగు తీసుకువెళ్ళడానికి కూడా వీల్లేకుండా గాలి విసురుగా వీస్తున్నది. సమయం ఏడయింది.

వాన ఏ మాత్రం తగ్గినా బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాడు రాజశేఖర్. అతని మనసంతా మైత్రేయి రూపం పరుచుకొని ఉంది.

ఎనిమిది గంటలకు గాలి తగ్గింది. వానమాత్రం అలా కురుస్తూనే ఉంది. రాజశేఖర్ మరిక ఉపేక్షించ లేకపోయాడు. గొడుగు, టార్చ్‌లైట్ తీసుకొని బయలుదేరుతూ ''కల్యాణీ! అర్జంట్ పని ఉంది. తప్పక వెళ్ళాలి. వీలయితే వచ్చేస్తాను. లేకుండా ఉదయాన్నే వస్తాను. తలుపు వేసుకొని పడుకో!' అన్నాడు రాజశేఖర్.

కల్యాణి అతని కన్నుల్లోకి చూసింది. ఆమెకు భర్త నడవడిక మీద ఎటువంటి అనుమానమూ లేదు. మౌనంగా తల ఊపి ''జాగ్రత్త''అని మాత్రం అంది.

బయట కాలుపెట్టగానే చలిగాలి తాకి ఒంట్లో ఒణుకు పుట్టింది. గొడుకు పట్టుకున్న చేయి సన్నగా ఒణికింది. అతను నడక సాగించాడు. గొడుగు వేసుకున్నా వర్షపు చినుకులు అతన్ని తడిపేసాయి.

రోడ్డుమీది నీళ్ళు పాదాలపై వరకు ఉన్నాయి. వాటిల్లో కాళ్ళు ఈడుస్తూ నడవాల్సి వచ్చింది. అక్కడక్కడా చెట్లు పడి ఉన్నాయి. టెలిగ్రాఫ్ తీగెలు తెగిపోయి ఉన్నాయి. దూరంగా మైత్రేయి ఇల్లు కనిపించింది. అతని శరీరం మధురానుభూతికి గురయింది. స్వర్గం రారమ్మని పిలుస్తున్నట్లు అనిపించింది. రాజశేఖర్ నడక వేగం పెంచాడు.

అతను కాంపౌండ్ వాల్ గేటు తెరుచుకొని లోనికి అడుగుపెట్టాడు. మైత్రేయి ఉంటున్న గది తలుపులోన గడియపెట్టి ఉంది. అతను తలుపు మీద కొట్టాడు. లోపల నుంచి ఎటువంటి సమాధానము లేదు. అతనీసారి గట్టిగా చప్పుడు చేసాడు. 'ఎవరూ?' అన్న మైత్రేయిగొంతు వినిపించింది. అతని అణువణువులో చైతన్యం వెల్లివిరిసింది. అతనేం సమాధానం ఇవ్వలేదు. మరో క్షణంలో తలుపు తెరుచుకుంది.

''హలో మైత్రేయీ! నేను రాజశేఖరాన్ని'' అంటూ అతనామె వైపు టార్చ్ ఫోకస్ చేసాడు. అతని కళ్ళు సంభ్రమంతో విప్పారాయి. ఆమె నుదుటి మీద బొట్టు చెరిగిపోయి ఉంది. అస్తవ్యస్తంగా ఉన్న చీరె ఆమె హడావుడిగా కట్టుకున్న విషయం చెప్పకనే చెబుతున్నది.

రాజశేఖర్‌ని చూడగానే ఆమె తడబడుతూ ''ఇంత వానలో మీరు వస్తారని ఊహించలేదు'' అంది. అంతలో మైత్రేయి ''వచ్చినదెవరు?''అంటూ ఓ యువకుడు బయటకు వచ్చాడు. అతని ఒంటి మీద లుంగీ తప్ప మరేం లేదు.

''ఇతను మా కజిన్ బ్రదర్. అనుకోకుండా వచ్చాడు''అంది మైత్రేయి. రాజశేఖర్‌కి ఆమె స్థితి అర్థమయింది. మౌనంగా వెనుదిరిగాడు. ''ఇంతవానలో వచ్చాడు! ఎవరతను?'అన్న ప్రశ్నకు అతనీ ఇంటి ఓనరు. ఒట్టితాగుబోతు. అద్దె డబ్బుకోసం వేళాపాళా లేకుండా వస్తుంటాడు' అన్న మైత్రేయి సమాధానం అస్పష్టంగా రాజశేఖర్ చెవిన పడింది. ఆమె మీద అసహ్యం వేసింది.

రాజశేఖర్ అణువణువూ విపరీతమైన నిస్త్రాణకు గురయింది. అతను నెమ్మదిగా ఇల్లు చేరాడు. తలుపు తెరిచే ఉంది. తలుపు దగ్గరే కల్యాణి నిలబడి ఉంది. ''ఇంత చలిలో ఇక్కడ నిలబడ్డావేం కల్యాణీ!' అన్నాడు రాజశేఖర్. ''మీ కోసమేనండి. ఇంతటి వానలో మీరు వెళ్తే చాలా భయం వేసింది' అంది కల్యాణి. ఒక ప్రేమ పవనం బలంగా తాకిన అనుభూతి. 'లోనికి పద' అని తలుపు వేసాడు రాజశేఖర్.

అతను కాళ్ళు కడుక్కొని డ్రెస్ మార్చుకొచ్చేసరికి కల్యాణి భోజనం వడ్డించింది.

'నీవు భోం చేసావా?' అని అడిగాడు రాజశేఖర్. 'లేదు' అంది కల్యాణి. రాజశేఖర్ పళ్ళెంలో అన్నం, కూర కలిపి ఒక ముద్ద ఆమె నోటికి అందించాడు. కల్యాణి అతని వంక ఆశ్చర్యంగా చూసి నోరు తెరిచింది.

భోజనం అయ్యాక రాజశేఖర్ బెడ్ మీద చేరాడు. మరికొద్ది సేపటికి కల్యాణి వచ్చి అతనికి కాస్తంత ఎడంగా పడుకుంది. ఈసారి అతను ఎప్పటిలా ఆమె వంక నిర్లిప్తంగా చూడలేదు. తానే కొద్దిగా జరిగి ఆమెను కౌగిలిలోకి తీసుకున్నాడు. కల్యాణి అతని గుండెలో గువ్వలా ఒదిగిపోయింది.

బయట కురుస్తున్న వానచప్పుడు వినిపిస్తూనే ఉంది. అతనికి మైత్రేయి జ్ఞాపకానికి వచ్చింది. మైత్రేయి తన వైపు లాక్కొని ముంచివేసే సుడిగుండం. మరి కల్యాణి? దాహం తీర్చి, ప్రాణం నిలిపే వాన చినుకు అనుకున్నాడు రాజశేఖర్.

★

## శాఖా హారి...!



మేనకాగాంధీ ఢిల్లీ, జైపూర్ హైవేలో నెలకొల్పిన జంతువుల ఆసుపత్రి సహాయార్థం ఏర్పాటు చేసిన చారిటీ షోలో పాల్గొన్న నటి శ్రీదేవి నోరు లేని జీవాలను చూసి చలించిపోయింది. తను ఇంత వరకూ ఇలాంటి జీవాన్నా ఇష్టంగా తింటున్నది...! ఎంతపాపం చేస్తున్నానని కుమిలిపోయి...ఇక మీదట పూర్తి శాఖాహారమే భుజిస్తానని ప్రమాణం చేసిందట..! 'నాన్ వెజిటేరియన్ జోక్ కాదు కదా..!'

-కృష్ణాజీ